ఏపీలో పెన్షన్ 4 వేలు

- ఐదు కీలక ఫైళ్లపై సంతకాలు చేసిన సీఎం చంద్రబాబు
- 16,347 టీచర్ పోస్టులతో మెగా డీఎస్సీ

హైదరాబాద్, జూన్ 13 (నమస్తే తెలంగాణ): ఏపీలో పింఛన్ రూ. 4 వేలకు పెంచుతూ ఏపీ సీఎం చంద్రబాబునాయుడు సంతకం చేశారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఆయన గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం 5 కీలక ఫైళ్లపై సంతకాలు చేశారు. 16,347 టీచర్ పోస్టుల భర్తీకి సంబంధించి మెగా డీఎస్సీ, ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు, సామాజిక పింఛన్లు రూ.4వేలకు పెంపు, అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ, నైపుణ్య గణన ఫైళ్లపై సంతకాలు చేశారు. పెంచిన పెన్షన్‌ను ఏప్రిల్ నుంచి అమలు చేస్తామని మంత్రులు తెలిపారు. జూలై ఒకటిన వృద్ధులకు 3 నెలల పెంచిన పెన్షన్‌తో కలిపి రూ.7వేలు ఇస్తామని చెప్పారు.

టీటీడీని ప్రక్షాళన చేస్తాం

రాష్ట్రంలో టీటీడీ నుంచే ప్రక్షాళన మొదలుపెడతామని, తిరుమల పవిత్రతను కాపాడుతామని సీఎం చంద్రబాబు తెలిపారు. సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత కుటుంబ సభ్యులతో కలిసి గురువారం వెంకటేశ్వరస్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం విజయవాడ కనకదుర్గమ్మ ఆలయంలో కుటుంబసమేతంగా పూజలు చేశారు.

రక్తదాన శిబిరాలు నిర్వహించాలి

వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

హైదరాబాద్, జూన్ 13 (నమస్తే తెలంగాణ): ప్రపంచ రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం అన్ని జిల్లా కేంద్రాల్లో రక్తదాన శిబిరాలు నిర్వహించాలని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన సచివాలయంలోని తన కార్యాలయంలో రాష్ట్రంలోని బ్లడ్ బ్యాంకుల పనితీరు, నిర్వహణ, బలోపేతంపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం, వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 63 బ్లడ్ బ్యాంకుల పనితీరు, నిర్వహణపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆధ్వర్యంలోని బ్లడ్ బ్యాంకులను ఆధునీకరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సెక్రటరీ క్రిస్టినాచొంగ్తూ, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ కర్ణన్, ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ హైమావతి, డీఎంఈ వాణి, టీవీవీపీ కమిషనర్ అజయ్‌కుమార్, ఐపీఎమ్ డైరెక్టర్ శివలీల, మెడికల్,హెల్త్ అదనపు డైరెక్టర్ డాక్టర్ అమర్ సింగ్ పాల్గొన్నారు.

'సర్వీస్ సర్టిఫికెట్లు సమర్పించండి'

హైదరాబాద్, జూన్ 13 (నమస్తే తెలంగాణ): డిప్యూటీ సివిల్ సర్జన్ నుంచి సివిల్ సర్జన్‌గా పదోన్నతి పొందేందుకు సీనియార్టీ జాబితాలోని అధికారులు సంబంధిత సర్టిఫికెట్లు సమర్పించాలని వైద్యారోగ్య శాఖ ఆదేశించింది. నో డ్యూస్, సర్వీస్ సర్టిఫికెట్లు, కాన్ఫిడెన్షియల్ రిపోర్టులను ఈ నెల 26లోగా సమర్పించాలని సూచించింది.

ప్రహరీ కూలి ముగ్గురు కూలీల మృతి

మంచిర్యాల ఏసీసీ, మే 13: ప్రమాదవశాత్తు ప్రహరీ కూలి ముగ్గురు కూలీలు మృతి చెందారు. గురువారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని బెల్లంపల్లి చౌరస్తాలో నందిని దవాఖాన సమీపంలో నూతన భవనం నిర్మిస్తున్నారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా చింతలమానేపల్లి మండల కేంద్రానికి చెందిన గోళెం పోషం (50), రుద్రాపూర్‌కు చెందిన హన్మంతు (35), బాబాపూర్‌కు చెందిన ఆత్రం శంకర్ (40), కౌటాల మండలం గుడ్లబోరి చెందిన మైదం రాములు పనిచేసేందుకు వచ్చారు. కొత్త భవనం పక్కన ప్రహరీ, దాని పక్కనున్న మరో ఇంటి ప్రహరీ మధ్యన మధ్యనున్న మట్టిని తొలగించి, బండరాళ్లు, ఇసుకతో నింపుతుండగా శిథిలావస్థలో ఉన్న ప్రహరీ వారిపై కూలింది. దీంతో పోషం, హన్మంతు, శంకర్ అక్కడికక్కడే మృతి చెందారు. గాయపడ్డ రాములును దవాఖానకు తరలించారు. మంచిర్యాల పట్టణ సీఐ బన్సీలాల్ ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను పొక్లెయిన్ సాయంతో వెలికితీశారు. మృతుల కుటుంబ సభ్యులు తమకు న్యాయం చేయాలంటూ మృతదేహాలతో రోడ్డుపై బైఠాయించారు. రామగుండం సీపీ శ్రీనివాస్, ఏసీపీ ప్రకాశ్, అదనపు కలెక్టర్ రాహుల్, ఆర్డీవో రాములు, మున్సిపల్ కమిషనర్ మారుతీప్రసాద్ ఘటనా స్థలానికి చేరుకుని బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. బిల్డింగ్ అనుమతులను వెంటనే రద్దు చేయాలని అదనపు కలెక్టర్ మున్సిపల్ కమిషనర్‌కు ఆదేశాలు ఇచ్చారు.

నామినేటెడ్ పదవులకు ఎదురుచూపులు

- కోడ్ ముగిసినా జీవోల అతాపతా లేదు
- ఖరారైన పేర్లలో మార్పులు జరుగుతున్నట్టు ప్రచారం
- లోక్‌సభ ఫలితాలు, మంత్రుల అభ్యంతరాలే కారణం
- మరో 15 పోస్టులకు అధిష్ఠానం గ్రీన్ సిగ్నల్
- అన్నింటికీ ఒకేసారి జీవో విడుదలయ్యే అవకాశం



హైదరాబాద్, జూన్ 13 (నమస్తే తెలంగాణ): నామినేటెడ్ పదవులలో మార్పులు, చేర్పులు జరుగుతున్నాయా?. మంత్రుల అభ్యంతరం, అనుకున్న రీతిలో పార్లమెంట్ ఫలితాలు రాకపోవడం ఈ చేర్పులు, మార్పులకు కారణమా?. దీనివల్లనే జీవోల జారీ జాప్యమవుతున్నదా? అన్న ప్రశ్నలకు కాంగ్రెస్ పార్టీ వర్గాలు అవుననే అంటున్నాయి. లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ ప్రకటనకు సరిగ్గా ఒకరోజు ముందు 37 నామినేటెడ్ పోస్టులు భర్తీ చేస్తున్నట్టు కాంగ్రెస్ వర్గాలు సమాచారమిచ్చాయి. అయితే షెడ్యూల్ వెలువడి కోడ్ అమలులోకి రావడంతో ఉత్తర్వుల జారీ ఆగిపోయింది. దీంతో ఎన్నికల తర్వాత జీవోలన్నీ గంపగుత్తగా ఒకేసారి విడుదల అవుతాయని పార్టీ పెద్దలు ఆశావహులకు హామీ ఇచ్చారు. దీంతో పదవుల సంబురంలో ద్వితీయ శ్రేణి నాయకులు పార్టీ అభ్యర్థుల విజయానికి తమవంతుగా బాగానే కష్టపడ్డారు. ఎన్నికల కోడ్ ముగిసి దాదాపు వారం దాటిపోయింది. కానీ నామినేటెడ్ పోస్టులకు సంబంధించిన జీవోలు మాత్రం విడుదలకు నోచుకోలేదు.

లోక్‌సభ ఎన్నికలలో పార్టీ ఆశించిన ఫలితాలు రాలేదని, కొన్నిచోట్ల నేతలు సరిగా పని చేయలేదని, నామినేటెడ్ పోస్టులకు ఖరారైన వారిలో కొందరు నిర్లక్ష్యం వహించారని పార్టీ అధిష్ఠానం ఆగ్రహంతో ఉన్నట్టు సమాచారం. మరోవైపు తమను సంప్రదించకుండా, చర్చించకుండా ఏకపక్షంగా నామినేటెడ్ పోస్టులు ప్రకటించారని కొందరు మంత్రులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నట్టు తెలిసింది. ఒకరిద్దరు మంత్రులు తమ అసంతృప్తిని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వరకు చేరవేశారు. మహబూబ్‌నగర్, మెదక్, నిజామాబాద్, కరీంనగర్ పార్లమెంట్ స్థానాలను కాంగ్రెస్ గెలుచుకోవాల్సి ఉన్నప్పటికీ స్థానిక నాయకుల నిర్లక్ష్యం వల్లనే 12 సీట్ల గెలవాలన్న లక్ష్యం నెరవేరలేదని పార్టీ పెద్దలు భావిస్తున్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలో ముందుగా ఖరారైన పేర్లలో స్వల్ప చేర్పులు, మార్పులు జరుగుతున్నట్టు పార్టీ వర్గాల సమాచారం.

మరో 15 పోస్టులకు గ్రీన్‌సిగ్నల్

మరికొన్ని నామినేటెడ్ పోస్టులను భర్తీ చేయాలని అధిష్ఠానం భావిస్తున్నట్టు తెలిసింది. వీటి భర్తీకి ఇటీవల తన రెండు రోజుల ఢిల్లీ పర్యటనలో సీఎం రేవంత్‌రెడ్డి అధిష్ఠానం నుంచి గ్రీన్ సిగ్నల్ పొందినట్టు సమాచారం. పార్లమెంట్ ఎన్నికలకు ముందు ప్రకటించిన 37 నామినేటెడ్ పోస్టులతో పాటు తాజాగా మరో 15 పోస్టులకు అధిష్ఠానం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో వీటన్నింటికీ కలిపి ఒకేసారి జీవోలు జారీ అయ్యే అవకాశం ఉన్నట్టు సీఎంఓ వర్గాలు పేర్కొన్నాయి.

ఓడ దాటాక బోడి మల్లన్న

పార్లమెంట్ ఎన్నికల ముందేమో పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయండి కష్టపడిన వారికి కచ్చితంగా గుర్తింపు ఉంటుందని హామీ ఇచ్చిన పార్టీ పెద్దలు ఇప్పుడు, ఆశించిన మేరకు ఫలితాలు రాలేదని, మంత్రులు అభ్యంతరం చెబుతున్నారని నామినేటెడ్ పోస్టుల భర్తీకి కుంటి సాకులు చెప్పడం, ఖరారైన పేర్లలో చేర్పులు, మార్పులు చేయడం ఏమిటని ఆశావాహులు మండిపడుతున్నారు. పార్టీ పెద్దలు ఏరు దాటాక బోడి మల్లన్న అన్నట్టుగా వ్యవహరిస్తున్నారని వాపోతున్నారు. పార్లమెంట్ ఫలితాలు ఆశించిన మేరకు రాకపోవడానికి తమనెలా బాధ్యులను చేస్తారని ప్రశ్నిస్తున్నారు. పలు స్థానాలకు ఎన్నికల ఇన్‌చార్జీలుగా వ్యవహరించిన మంత్రులను వారి పదవుల నుంచి తొలగిస్తారా? అని ప్రశ్నిస్తున్నారు. దశాబ్దకాలంగా అధికారం లేకపోయినా పార్టీనే నమ్ముకొని ఉన్న వారికే నామినేటెడ్ పోస్టులు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. అర్హతలేని అనామకులకు పదవుల పందేరం చేస్తే సహించేదిలేదని హెచ్చరిస్తున్నారు. ఇదిలా ఉండగా కొత్త పీసీసీ అధ్యక్షుడి నియామకం జరుగక ముందే నామినేటెడ్ పోస్టులన్నీ భర్తీ చేయాలని పీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్‌రెడ్డి పట్టుదలతో ఉండటంతో ఈ పోస్టు భర్తీలో ఇక జాప్యం జరుగకపోవచ్చని పార్టీ ముఖ్య నేత ఒకరు అభిప్రాయపడ్డారు.

జోగుళాంబ గద్వాల జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆశ వర్కర్లు

సర్కారు 'జ్ఞాపకశక్తి'పై ఆశాల కన్నెర్ర

- నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ కలెక్టరేట్ల ఎదుట ధర్నా
- జ్ఞాపకశక్తి కోసం పరీక్షలు చేయొద్దని డిమాండ్

న్యూస్‌నెట్‌వర్క్, జూన్ 13 (నమస్తేతెలంగాణ): ఆశ కార్యకర్తలకు జ్ఞాపకశక్తి పరీక్షలు నిర్వహించాలన్న ప్రభుత్వ నిర్ణయంపై ఆశాలు కన్నెర్ర చేశారు. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ గురువారం రాష్ట్రవ్యాప్తంగా ఆశ వర్కర్లు జిల్లాల కలెక్టరేట్ల వద్ద ధర్నాలు నిర్వహించారు. పొద్దనకా, మాపనకా ప్రజారక్షణే పరమావధిగా విధులు నిర్వహిస్తున్న ఆశ కార్యకర్తల జ్ఞాపకశక్తిని పరీక్షించడానికి పరీక్షలు నిర్వహించాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఇందులో భాగంగా ఆశ వర్కర్లు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని ఆయా కలెక్టరేట్ల ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. ఆశ కార్యకర్తలకు జ్ఞాపకశక్తి విధానంతో కొత్తగా ఒరిగేదేమీ లేదని, కార్యకర్తలను తొలగించేందుకే నూతన విధానం అమల్లోకి తెస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఆశ వర్కర్లకు గౌరవ వేతనం నిర్ణయిస్తామని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కూడా కల్పిస్తామంటూ హామీ ఇచ్చి అమలు చేయడం లేదని విమర్శించారు. మహబూబ్‌నగర్, గద్వాల, నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టరేట్ల ఎదుట నిర్వహించిన ధర్నాలో ఆశాలు మాట్లాడుతూ.. పెరిగిన ధరలకనుగుణంగా రూ.18 వేల గౌరవ వేతనం, రూ.50 లక్షల ఇన్సూరెన్స్, రూ.5 లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్స్‌తోపాటు జీతంలో సగం పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆశాల సంక్షేమం కోసం ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలంటూ రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ఎదుట తెలంగాణ ఆశ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో ఆశ వర్కర్లు ధర్నా నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తున్న ఆశాలు జ్ఞాపకశక్తిని నిరూపించుకునేందుకు ప్రభుత్వం ఎగ్జామ్స్ నిర్వహించడం సమంజసం కాదని మండిపడ్డారు. మహబూబాబాద్, ములుగు కలెక్టరేట్ల ఎదుట నిర్వహించిన ధర్నాలో ఆశ వర్కర్లు మాట్లాడుతూ.. 33 సంవత్సరాల నుంచి ఆశాలుగా పనిచేస్తూ అనేక రకాల శిక్షణ తీసుకున్నామని, ఇప్పుడు మళ్లీ పరీక్షలు పెట్టాలనే విధానాన్ని వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కాగా.. ములుగులో డీఎంహెచ్‌వో అప్పయ్య ఆశ వర్కర్ల యూనియన్ లీడర్లను మంత్రి సీతక్క వద్దకు తీసుకెళ్లి వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ సర్కారుపై ఆశా కార్యకర్తలు కదంతొక్కుతూ ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల కలెక్టరేట్‌ల ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. 'పారితోషికం మాకొద్దు.. కనీస వేతనం కావాలి' అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. గిరిజన ప్రాంతాల్లో 33 ఏండ్లు, మైదాన ప్రాంతాల్లో 19 ఏండ్ల నుంచి పనిచేస్తున్న తమకు.. ప్రతినెలా రూ.26 వేల వేతనం చెల్లించాలని కోరారు. పనిభారం తగ్గించి జాబ్‌కార్డులు ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ, ఇన్సూరెన్స్ రూ.50 లక్షల సౌకర్యం కల్పించాలని, ప్రతి నెలా 2వ తేదీనే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆయా జిల్లాల కలెక్టర్లకు వినతిపత్రాలు అందజేశారు.

కాంగ్రెస్ నాయకుల ఆగడాలకు అధికారి బదిలీ

- 'కాంగ్రెస్ కండువా కప్పుకుంటేనే కరెంట్' కథనానికి స్పందన
- విద్యుత్తు ఏఈని బదిలీ చేసిన అధికారులు

నల్లబెల్లి, జూన్ 13: కాంగ్రెస్ నాయకుల ఆగడాలకు ఓ కింది స్థాయి అధికారి బదిలీ అయ్యారు. 'కండువా కప్పుకుంటేనే కరెంట్' అనే శీర్షికన ఈ నెల 11న 'నమస్తే తెలంగాణ' మెయిన్‌లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈ మేరకు వరంగల్ జిల్లా నల్లబెల్లి మండల విద్యుత్తు ఏఈ పెద్ది రవళిపై బదిలీ వేటు వేశారు. ఏజెన్సీ భూములకు విద్యుత్తు సౌకర్యం కల్పించి బోర్లు వేసేందుకు మేడెపల్లి గ్రామ కాంగ్రెస్ ఎంపీటీసీ భర్త మోహన్‌తోపాటు ఆసరవెల్లి, మేడెపల్లి గ్రామ పార్టీ అధ్యక్షుడు జనగాం రాజు, వంగర వెంకన్న, కార్యదర్శి ఆవుల ఐలయ్య బోరు వాహనాల ఏజెంట్ల నుంచి రూ.2.80 లక్షలు కమీషన్‌గా తీసుకుని రూ.77 వేల చొప్పున పంచుకున్నారు. పోడు పట్టాలు పొందిన 490 మంది రైతులు 9 ట్రాన్స్‌ఫార్మర్ల కోసం డీడీలు తీయగా, ఇటీవల కాంట్రాక్టర్ విద్యుత్తు స్తంభాలు తీసుకువచ్చాడు. అయితే కరెంట్ సరఫరా ఇవ్వాలంటే సదరు కాంట్రాక్టర్‌తో కుమ్మక్కైన పలువురు కాంగ్రెస్ నాయకులు.. రైతులు కమీషన్లు ఇవ్వాలంటూ డిమాండ్ చేశారు. దీంతో బాధిత రైతులు ససేమిరా అనడంతో సదరు కాంగ్రెస్ నాయకుల ఒత్తిడితో విద్యుత్తు శాఖ అధికారులు కరెంట్ పోల్స్‌ను తిరిగి ఇతర ప్రాంతాలకు తరలించారు. ఈ నేపథ్యంలో 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన 'కండువా కప్పుకుంటేనే కరెంట్' కథనానికి స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్తు శాఖ ఏఈ రవళిని రాయపర్తి మండలానికి బదిలీ చేసింది. కాంగ్రెస్ నాయకుల ఆగడాలకు చివరకు ఉద్యోగి బలయ్యే దుస్థితి ఏర్పడింది.

కొత్తగా 'మహిళాశక్తి' క్యాంటీన్లు

- కలెక్టరేట్లు, పర్యాటక ప్రాంతాలు, దేవాలయాలు, బస్టాండుల్లో ఏర్పాటు
- 150 క్యాంటీన్లు లక్ష్యం: సీఎస్

హైదరాబాద్, జూన్ 13 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో 'మహిళా శక్తి – క్యాంటీన్ సర్వీస్'లను ఏర్పాటు చేయనున్నట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి తెలిపారు. క్యాంటీన్ సర్వీస్‌ల ఏర్పాటుపై గురువారం సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళాసంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయాలన్న సీఎం ఆదేశాల మేరకు అన్ని ప్రధాన కార్యాలయాలు, కలెక్టరేట్లు, పర్యాటక ప్రాంతాలు, దేవాలయాలు, బస్టాండ్లు, పారిశ్రామిక ప్రాంతాల్లో మహిళా సంఘాల ఆధ్వర్యంలో క్యాంటీన్లను ఏర్పాటు చేస్తామని తెలిపారు. అన్న క్యాంటీన్ల పేరుతో కేరళలో, దీదీ కా రసోయ్ పేరుతో బెంగాల్‌లో నడుస్తున్న క్యాంటీన్ల పనితీరుపై అధ్యయనం చేసినట్టు వివరించారు. రెండేండ్లలో 150 క్యాంటీన్లను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని వెల్లడించారు. ఈ క్యాంటీన్ల నిర్వహణపై గ్రామ సమాఖ్య సంఘాలకు శిక్షణ ఇచ్చి, వాటికే అప్పగించనున్నట్టు తెలిపారు. క్యాంటీన్ల పనితీరు, నిర్వహణకు అవసరమయ్యే స్థలం, రోడ్‌మ్యాప్ అంశాలపై సవివరంగా ప్రణాళికను రూపొందించాలని గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ అనితారామచంద్రన్‌ను ఆదేశించారు. సమావేశంలో రెవెన్యూశాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, పంచాయతీరాజ్, ఆరోగ్యశాఖ కమిషనర్ కర్ణన్, దేవాదాయ, ధర్మాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, టూరిజం శాఖ డైరెక్టర్ నిఖిల, కార్పొరేషన్ ఎండీ రమేశ్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే మరో ఉద్యమం

ప్రభుత్వానికి తెలంగాణ పెన్షనర్ల జేఏసీ అల్టిమేటం

హైదరాబాద్, జూన్ 13 (నమస్తే తెలంగాణ): సమస్యలను పరిష్కరించకుంటే మరో ఉద్యమం తప్పదని తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్ల జేఏసీ రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించింది. గురువారం తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్ల జేఏసీ చైర్మన్ లక్ష్మయ్య అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నది. నూతన ప్రభుత్వం పెన్షనర్లకు, ఉద్యోగులకు అనేక ఆశలు చూపి ఒక్కటీ నెరవేర్చలేదని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఉద్యోగులు, పెన్షనర్లకు రావలసిన డీఆర్, హెల్త్‌కార్డులను అమలు చేయాలని డిమాండ్ చేసింది. లేకపోతే జూలై రెండో వారంలో 'చలో హైదరాబాద్' ఉద్యమ కార్యాచరణను చేపట్టాలని సమావేశం తీర్మానించింది. అంతకుముందు తెలంగాణ డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీస్ కే శ్రీరామచంద్రమూర్తి జేఏసీ సావనీర్–24ను ఆవిష్కరించారు. రెండో సెషన్లో పెన్షనర్ల దీర్ఘకాలిక పెండింగ్ సమస్యలపై జేఏసీ ప్రతినిధులు చర్చించారు. జనరల్ సెక్రటరీ ప్రభాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మోతె తహసీల్దార్ కార్యాలయం ఎదుట అధికారులను వేడుకుంటున్న కమలమ్మ

నా భూమిని ఇప్పించండి

తహసీల్దార్ కార్యాలయం ఎదుటపురుగుమందు డబ్బాతో వృద్ధురాలి ఆందోళన

- సూర్యాపేట జిల్లా మోతెలో ఘటన

మోతె, జూన్ 13 : తన భూమిని మోసపూరితంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని, దాన్ని రద్దు చేసి తనకు న్యాయం చేయాలని కోరుతూ ఓ వృద్ధురాలు తహసీల్దార్ కార్యాలయం ఎదుట పురుగుమందు డబ్బాతో నిరసనకు దిగింది. సూర్యాపేట జిల్లా మోతె మండల కేంద్రంలో గురువారం ఈ ఘటన చోటుచేసుకున్నది. బాధితురాలు ఎర్ర కమలమ్మ కథనం ప్రకారం.. మోతె మండలం రావిపహాడ్‌కు చెందిన కమలమ్మ, పెద్ద వెంకట్‌రెడ్డి దంపతులకు సంతానం లేదు. దాంతో కమలమ్మ అక్క కుమారుడు శ్రీనివాస్‌రెడ్డిని సాదుకుంటూ చదివించారు. 2016లో తన భర్త బతికి ఉన్నప్పుడు శ్రీనివాస్‌రెడ్డి 15 ఎకరాలు మోసపూరితంగా గిఫ్ట్ డీడ్ చేయించుకున్నాడని కమ్మలమ్మ వాపోయింది. ఆ రిజిస్ట్రేషన్ రద్దు చేసి ఆ భూమిని తనకు ఇప్పించాలని పలుమార్లు అధికారులను ప్రాథేయపడినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తంచేసింది. గ్రామ పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టగా 8 నెలల్లో పట్టా మార్పిడి చేయిస్తానని చెప్పి మాట మారుస్తున్నాడని పేర్కొంది. అక్రమంగా చేయించుకున్న పట్టాను రద్దు చేయకపోతే ఆత్మహత్య చేసుకుంటానని వాపోయింది. తహసీల్దార్ సంఘమిత్ర స్పందిస్తూ భూ సమస్యను న్యాయస్థానంలో తేల్చుకోవాలని, ఆర్ఐతో విచారణ చేయిస్తామని నచ్చజెప్పి వృద్ధురాలి ఆందోళనను విరమింపజేశారు.

మంత్రులకు నిరసన సెగ

- పరిహారం, పోడు పట్టాల కోసం నిర్వాసితులు, గిరిజనుల ఆందోళన
- 'సీతారామ కాలువల' పరిశీలనకు వెళ్లిన మంత్రుల అడ్డగింతకు యత్నం
- లాగిపడేసిన పోలీసులు
- రోడ్డుపై బైఠాయించిన ఆందోళనకారులు
- బాధితులతో మంత్రి పొంగులేటి చర్చ
- సమస్యల పరిష్కారానికి హామీ

భద్రాద్రి జిల్లా ములకలపల్లి మండలం ఒడ్డు రామవరంలోని సీతారామ ప్రాజెక్టు పంపు హౌస్ వద్ద మంత్రులను కలిసేందుకు వెళ్తున్న ఆందోళనకారులను పోలీసులు అడ్డుకోవడంతో తనను అనుమతించాలంటూ పోలీసును వేడుకుంటున్న నిర్వాసితుడు

అశ్వారావుపేట/ములకలపల్లి, జూన్ 13: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలంలో మంత్రులకు నిరసన సెగ తగిలింది. మంత్రులు వస్తున్నట్టు తెలుసుకున్న సీతారామ ప్రాజెక్టు కాలువల నిర్మాణాల్లో సాగు భూములు కోల్పోయిన నిర్వాసితులు తమకు పరిహారం చెల్లించాలని ఆందోళనకు దిగారు. గురువారం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ, రెవెన్యూ, నీటిపారుదల శాఖల మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఖమ్మం, మహబూబాబాద్ ఎంపీలు రామసహాయం రఘురాంరెడ్డి, పోరిక బలరాం నాయక్, ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎమ్మెల్యేలతో కలిసి ములకలపల్లి మండలం ఒడ్డురామవరం గ్రామ సమీపంలో నిర్మిస్తున్న సీతారామ ప్రాజెక్టు పంపుహౌస్ పనులను పరిశీలించేందుకు వెళ్లారు. ప్రాజెక్టు కాలువ, పంపుహౌస్ నిర్మాణాల్లో భూములు కోల్పోయిన ఆ గ్రామానికి చెందిన నిర్వాసితులు అక్కడికి చేరుకొని మంత్రులను అడ్డుకోబోయారు. వెంటనే పోలీసులు వారిని పక్కకు నెట్టేశారు. అదే సమయంలో అక్కడికి చేరుకున్న పోడు భూముల గిరిజనులతో కలిసి రోడ్డుపై బైఠాయించారు. ప్రాజెక్టు కాలువల కోసం తీసుకున్న తమ భూములకు పరిహారం ఇవ్వాలని, 25 ఏండ్లుగా సాగు చేసుకుంటున్న పోడు భూములకు పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. దీంతో ఆందోళనకారులను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పిలిపించుకొని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టు కాలువల నిర్మాణంలో సాగు భూములు కోల్పోయిన తమకు పరిహారం అందలేదని వివరించారు. పోడు చేసుకుంటున్న తమను అటవీ అధికారులు కేసులతో వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కోర్టుల చుట్టూ తిరగలేక అవస్థలు పడుతున్నట్టు చెప్పారు. తక్షణమే పరిహారం మంజూరు చేయాలని, పోడు భూములకు హక్కు పత్రాలు అందించాలని, కేసులు ఎత్తివేయాలని విజ్ఞప్తి చేశారు. లిఖిత పూర్వకంగా వినతిపత్రం ఇస్తే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని మంత్రి హామీ ఇచ్చారు. దీంతో ఆందోళన విరమించిన నిర్వాసితులు, పోడు గిరిజనులు మంత్రి పొంగులేటికి వినతిపత్రం అందజేశారు.

ఏన్కూరు లింక్ కాలువకు రాజీవ్‌గాంధీ పేరు

ఖమ్మం, జూన్ 13 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఏన్కూరు లింకు కాలువకు రాజీవ్ కెనాల్‌గా నామకరణం చేసినట్టు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, సాగు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రకటించారు. ఆగస్టు 15 నాటికి దానిని పూర్తి చేసి 1.20 లక్షల ఎకరాలకు గోదావరి నుంచి సాగునీటిని అందిస్తామని తెలిపారు. సీతారామ ఎత్తిపోతల పథకంలో 1, 2, 3వ ప్యాకేజీల పనులను త్వరలోనే పూర్తి చేస్తామని చెప్పారు. మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి వారు భద్రాద్రి జిల్లాలో గురువారం పర్యటించారు. తొలుత అశ్వాపురం మండలం అమ్మగారిపల్లి వద్ద ఉన్న సీతారామ ప్రాజెక్టు హెడ్ రెగ్యులేటరీ పనులను పరిశీలించారు. తర్వాత ములకలపల్లి మండలం పూసుగూడెం వద్ద మూడో పంప్‌హౌస్ పురోగతి గురించి ఎంపీలు, ఎమ్మెల్యేలు, అధికారులతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 9 కిలోమీటర్లు ఉన్న ఏన్కూరు లింక్ కెనాల్‌ను పూర్తి చేయడానికి రూ.72 కోట్లు మంజూరు చేశామని, సీతారామ పంపుహౌస్‌ల 1, 2, 3వ డిస్ట్రిబ్యూటరీ ప్యాకేజీ పనులు త్వరలోనే మొదలవుతాయని వెల్లడించారు.

త్వరలో ఆరోగ్యశాఖ ప్రక్షాళన

- కిందిస్థాయి నుంచి హెచ్‌వోడీల దాకా బదిలీ
- అవినీతి, లైంగిక వేధింపుల ఆరోపణలే కారణం
- నెలాఖరులోగా డీఎంహెచ్‌వోల మార్పులు

హైదరాబాద్, జూన్ 13 (నమస్తే తెలంగాణ): ఆరోగ్య శాఖలో భారీ ప్రక్షాళనకు రంగం సిద్ధమవుతున్నట్టు తెలుస్తున్నది. వరుసగా అవినీతి ఆరోపణలు, మహిళా ఉద్యోగులపై లైంగిక వేధింపుల ఘటనలు వెలుగు చూస్తుండటంతో కిందిస్థాయి నుంచి పైవరకు మార్పులు చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు తెలిసింది. హెచ్‌వోడీలను కూడా మార్చనున్నట్టు సమాచారం. జిల్లాల్లోని డీఎంహెచ్‌వో కార్యాలయాలు మొదలు హైదరాబాద్‌లోని హెచ్‌వోడీల కార్యాలయాల వరకు ఏండ్లకేండ్లుగా తిష్టవేసి విచ్చలవిడి అవినీతికి పాల్పడుతున్నవారి గురించి ప్రత్యేకంగా నివేదికలు తెప్పించుకుంటున్నట్టు సమాచారం. ప్రక్షాళనను ముందుగా బదిలీల ప్రక్రియతో మొదలుపెట్టనున్నారు. ఐదేండ్లకుపైబడి ఒకే చోట పనిచేస్తున్నవారిని కదిలించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఇప్పటికే డీపీహెచ్, డీఎంఈ, టీవీవీపీ, ఇతర విభాగాల నుంచి వైద్యారోగ్య శాఖ కార్యదర్శికి జాబితా చేరింది. త్వరలోనే బదిలీల ప్రక్రియ ప్రారంభం కానున్నది. తద్వారా ఏండ్లకేండ్లుగా హైదరాబాద్, ఇతర నగరాల్లో పాతుకుపోయినవారిని కదిలించే అవకాశం ఉన్నదని వైద్యారోగ్య శాఖ వర్గాలు చెప్తున్నాయి. ఆ తర్వాత డీఎంహెచ్‌వోలపై దృష్టి పెట్టనున్నట్టు తెలిసింది. ప్రస్తుతం ఉన్న డీఎంహెచ్‌వోల్లో సగం మందికి పైగా మార్చి, కొత్తవారికి అవకాశం ఇస్తారని చెప్పుకుంటున్నారు.

అవినీతి.. లైంగిక వేధింపులు

కొన్ని నెలలుగా పలువురు డీఎంహెచ్‌వోలు, ఇతర అధికారులపై విపరీతమైన ఆరోపణలు వస్తున్నాయి. ఇటీవలే లైంగిక వేధింపుల కేసులో కామారెడ్డి డీఎంహెచ్‌వో లక్ష్మణ్‌సింగ్‌ను సస్పెండ్ చేసిన సంగతి తెలిసిందే. గత జనవరిలో జనగామ డీఎంహెచ్‌వో ప్రశాంత్, జూనియర్ అసిస్టెంట్ అస్గర్ కలిసి రూ.50 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కారు. ఇక డీపీహెచ్ రవీందర్‌నాయక్‌తోపాటు మెదక్ డీఎంహెచ్‌వో చందూనాయక్ డబ్బులు తీసుకొని బదిలీలు చేస్తున్నారంటూ ఓ మహిళా ఉద్యోగి ఆరోపణలు చేసిన ఆడియో వైరల్ అయిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో మొదట్లో నష్టనివారణ చర్యగా ఆ మహిళను సస్పెండ్ చేసినా.. తర్వాత మెదక్ డీఎంహెచ్‌వో చందూనాయక్‌పై వేటు వేశారు. అదే కార్యాలయంలో ఓ ఉద్యోగి నిరుడు డిసెంబర్‌లో ఏసీబీకి చిక్కారు. డీపీహెచ్ కార్యాలయ సూపరింటెండెంట్ సలావుద్దీన్ నిజామాబాద్‌కు చెందిన ఓ స్టాఫ్‌నర్స్‌పై లైంగిక వేధింపులకు పాల్పడినట్టు సరూర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఐసీసీ కమిటీ నివేదిక మేరకు సలావుద్దీన్‌ను సస్పెండ్ చేశారు.

హెచ్‌వోడీలు సైతం..

ప్రస్తుతం డీపీహెచ్, డీఎంఈ, టీవీవీపీ కమిషనర్, టీజీఎంఎస్ఐడీసీ ఎండీలుగా ఇన్‌చార్జీలు కొనసాగుతున్నారు. డీపీహెచ్, డీఎంఈ పోస్టులపై హైకోర్టులో కేసు పెండింగ్‌లో ఉన్నది. కోర్టు నుంచి ఆదేశాలు రాకముందే ఆ పోస్టులను రెగ్యులర్ అధికారులతో భర్తీ చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు సమాచారం. ఈ మేరకు సీనియార్టీ జాబితా కూడా సిద్ధమైనట్టు తెలుస్తున్నది. టీజీఎంఎస్ఐడీసీ ఎండీని కూడా నియమిస్తారని తెలుస్తున్నది. టీవీవీపీ కమిషనర్‌ను సైతం మార్చాలని నిర్ణయించినట్టు సమాచారం. హెల్త్ సెక్రటరీ క్రిస్టినా చొంగ్తు సైతం మొదటి నుంచీ అయిష్టంగానే కొనసాగుతున్నారని వైద్యవర్గాలు చెప్తున్నాయి. మొదట్లోనే ఆ బాధ్యతలు వద్దని ఆమె చెప్పినట్టు ప్రచారం జరిగింది. ఇలా క్షేత్రస్థాయి మొదలు హెచ్‌వోడీల వరకు వైద్యశాఖను రెండుమూడు నెలల్లో ప్రక్షాళన చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు సమాచారం.

కాంగ్రెస్ హామీలను అమలు చేయాలి

- వ్యవసాయ కూలీలకు 12 వేలు, మహిళలకు రూ.2,500 అందించాలి
- నిరుద్యోగ భృతి చెల్లించి, జాబ్ క్యాలెండర్ ప్రకటించాలి: బీవీ రాఘవులు

హైదరాబాద్, జూన్ 13 (నమస్తే తెలంగాణ): ఎన్నికల హామీలను అమలు చేయాలని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం సీపీఎం సీనియర్ నేత చెరుపల్లి సీతారాములు అధ్యక్షతన జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశంలో పలు తీర్మానాలు ఆమోదించారు. ఈ సందర్భంగా రాఘవులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో వ్యవసాయ కూలీలకు ఏటా రూ.12 వేలు, మహిళలకు నెలకు రూ.2,500 ఇస్తామని హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. రాష్ట్రంలో 20 లక్షల మందికిపైగా కౌలురైతులు 30 శాతానికి పైగా వ్యవసాయం చేస్తున్నారని తెలిపారు. కౌలు రైతులకు 2011 చట్టప్రకారం లోన్ ఎలిజిబులిటీ కార్డులు ఇవ్వాలని, ధరణి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో పంటలబీమా ప్రీమియం మొత్తం ప్రభుత్వమే చెల్లించాలని, దొడ్డు బియ్యం, ఇతర పంటలకూ బోనస్ ఇవ్వాలని కోరారు. నిరుద్యోగ భృతి ఇవ్వాలని, జాబ్ క్యాలెండర్ ప్రకటించి ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. పేదలందరికీ ఇందిరమ్మ పథకం కింద ఆర్థిక సహాయం చేయాలని విన్నవించారు. అటవీ హక్కుచట్టం ప్రకారం అర్హులైనందరికీ హక్కుపత్రాలు ఇవ్వాలని అన్నారు. ఉద్యోగుల బకాయిలు, విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పంచాయతీ కార్మికులు, మున్సిపల్ కార్మికులు, ప్రభుత్వ హాస్పిటల్స్ కాంట్రాక్ట్ కార్మికులు, 104 ఉద్యోగులకు వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని, ధరలకు అనుగుణంగా జీతాలను సవరించాలని కోరారు. సమావేశంలో నేతలు వీరభద్రం, రంగారెడ్డి, నర్సింహారెడ్డి, వీరయ్య, జ్యోతి, సాగర్ ఉన్నారు.